







విఘ్నేశ్వరాయ.. విభిన్న రూపాయ


చంద్రనగర్‌లో ఆపరేషన్ సిందూర్ వినాయక మండపంలో పైలట్ మూషికంతో వినాయకుడు


గోపాలపట్నం రైతుబజారు వెనుక శీనుబాబు నగర్‌లో ఆపరేషన్ సిందూర్ సైనిక నాయకుడిగా..


పాతగోపాలపట్నంలో పార్వతీదేవి ఒడిలో సేద తీరుతున్న బాల వినాయకుడు


పల్లివీధిలో శివలింగానికి పై నుంచి అభిషేకిస్తున్న గణనాథుడు

గోపాలపట్నం/మల్కాపురం/కంచరపాలెం: ఏకదంతుడు.. వక్రతుండ మహాకాయుడు.. పార్వతీసుతుడైన వినాయకుడు విభిన్న రూపాల్లో కొలువుదీరాడు. గణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా గోపాలపట్నం, ఎన్ఏడీ, మల్కాపురం, సింధియా తదితర ప్రాంతాల్లో ఆకర్షణీయమైన మండపాల్లో గణనాయకుడిని ప్రతిష్ఠించి, పూజలు చేస్తున్నారు. దైవభక్తితో పాటు దేశభక్తిని ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ఆపరేషన్ సిందూర్ సెట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మిస్సైల్‌తో చిన్నారి, పైలట్ మూషికంతో గణేశుడు, శీనుబాబునగర్‌లో రైతుబజారు వెనుక వేసిన సెట్‌లో సైనికుడిగా వినాయకుడు, మహిళా సైనికాధికారులు ఆకట్టుకుంటున్నారు. పర్యావరణ పరిరక్షణకు పాటు పడకపోతే ప్రకృతి వినాశనం తప్పదంటూ 2020–2050 కాన్సెప్ట్‌తో కొత్తపాలెం మసీదు వద్ద మండపాన్ని రూపొందించి, లోపల పర్యావరణ హిత విఘ్నేశ్వరుడిని ఏర్పాటు చేశారు. పాత గోపాలపట్నంలో పార్వతీదేవి ఒడిలో సేద తీరుతున్న బాల వినాయకుడు భక్తులను అలరిస్తున్నాడు. ఐవోసీ చింతామణి దుర్గాగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మల్కాపురం గొల్లవీధిలో శయన గణపతి, పల్లివీధి వద్ద శివలింగం చుట్టూ గాలిలో తిరుగుతూ అభిషేకిస్తున్న గణపతి, మల్కాపురంలో శ్రీకృష్ణుడిగా వినాయకుడి విగ్రహాలు ఆకట్టుకున్నాయి. మల్కాపురం పల్లివీధి వద్ద కొలువు దీరిన గణనాథుడుని మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు దర్శించుకున్నారు. 56వ వార్డులోని కంచరపాలెం, ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్‌ల పరిధిలో గణపతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గొల్లకంచరపాలెం నేతాజీ గ్రంథాలయం వద్ద వరసిద్ధి వినాయక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో పాచికలాట ఆడుతున్న వేంకటేశ్వరుడు, వినాయకుడు.. కంచరపాలెం రైల్వే ట్రాక్ రహదారిలో చిన్నారులు ఏర్పాటు చేసిన సంగీత ప్రియ గణనాథుడిగా మూషికాల మ్యూజిక్ సెట్ ఆకర్షణగా నిలిచాయి. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, నమ్మి ఆనంద్ శివప్రసాద్(నాని), నమ్మి జ్యోతిబాబు పాల్గొన్నారు.


మల్కాపురంలో కృష్ణుడి రూపంలో విఘ్న నాయకుడు


కంచరపాలెంలో సంగీత ప్రియ గణనాథుడి సెట్‌లో చిన్నారుల సందడి


కొత్తపాలెంలో పర్యావరణ ప్రియ గణనాథుడు


గొల్లకంచరపాలెం మండపంలో వేంకటేశ్వర స్వామితో పాచికలాడుతున్న వినాయకుడు





మా పొట్ట కొట్టొద్దు

- ‘ఉచిత బస్సు ప్రయాణం’తో ఆందోళన బాటలో ఆటోవాలాలు
- కుటుంబ పోషణ భారమైందని ఆవేదన


మల్కాపురం వద్ద నినాదాలు చేస్తున్న ఆటో కార్మికులు


ఎన్ఏడీ జంక్షన్‌లో ఆటోలను ఆపి బంద్‌కు మద్దతు కోరుతున్న సహచర ఆటో డ్రైవర్లు

గోపాలపట్నం: స్త్రీ శక్తి పథకం పేరిట మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో తాము రోడ్డున పడ్డామంటూ ఆటో డ్రైవర్లు ఆందోళన బాట పట్టారు. ఓటు బ్యాంకు నింపుకోవడం కోసమే రాజకీయ నాయకులు తమ పొట్టలు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోపాలపట్నం, ఎన్ఏడీ జంక్షన్ ప్రాంతాల్లో గురువారం స్థానిక ఆటో డ్రైవర్లు ఆటోలను తిరగనివ్వకుండా అడ్డుకున్నారు. స్వచ్ఛందంగా బంద్ పాటించాలని సహచర డ్రైవర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రయాణికులను దించి ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా.. ఎన్ఏడీ జంక్షన్‌లో ఆటోలను ఆపుతున్న డ్రైవర్లతో కంచరపాలెం సీఐ రవి కుమార్, పోలీస్ సిబ్బంది మాట్లాడి అక్కడ వారిని గుమిగూడకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల ఆటోలపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. నగర పరిధిలోని ఆటోలు మహిళా ప్రయాణికులపై ఆధార పడుతున్నాయని తెలిపారు. 90 శాతం వరకు మగవారికి ద్విచక్ర వాహనాలు ఉన్నాయని, వీరు ఆటోలను ఆశ్రయించరన్నారు. గతంలో రోజుకు రూ.600 నుంచి రూ.1,000 వరకు సంపాదించే వారిమని, ఇప్పుడు కనీసం రూ.300 కూడా సంపాదించలేని దుస్థితి ఏర్పడిందని వాపోయారు. కొత్తగా ఆటోలు కొనుక్కున్న వారం రుణ వాయిదాలు కట్టలేకపోతున్నారని, అప్పులిచ్చిన వారు ఆటోలు సీజ్ చేస్తారనే భయంతో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ గోడు పట్టించుకోవాలని ఆటో కార్మికులు కోరుతున్నారు.

ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలి

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత ఆటో డ్రైవర్లు నినదించారు. జింక్ నుంచి సింధియా వరకు సుమారు 800కు పైగా ఆటోలను నిలిపి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మల్కాపురం వద్ద గురువారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకుడు గొలగాని నాయుడు మాట్లాడుతూ ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ప్రవేశ పెట్టడం వల్ల మహిళలు ఎవరు ఆటో ఎక్కడం మానేశారన్నారు. ఈ కారణంగా తమ ఆటోల సర్వీస్ తగ్గి, ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. ప్రభుత్వం తమ సమస్యను అర్థం చేసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

కరాసాలో దుకాణాల తొలగింపు

- స్థానికుల ఫిర్యాదు మేరకు ఆకతాయిల ఆగడాలపై చర్యలు


బంక్ వద్ద దుకాణాలను తొలగిస్తున్న అధికారులు

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు కరాసా పెట్రోల్ బంక్‌ను ఆనుకుని ఉన్న దుకాణాలను జీవీఎంసీ అధికారులు పోలీసుల సహకారంతో తొలగింపు చర్యలు చేపట్టారు. ఇక్కడ పాన్‌షాపుతోపాటు పలు దుకాణాలు ఏర్పాటు చేసి చాలా కాలంగా వ్యాపారాలు సాగిస్తున్నారు. దుకాణాలను అడ్డాగా చేసుకుని గంజాయి బాబులు, ఆకతాయిలు తమను ఇబ్బందులు గురిచేస్తున్నారని, దాడులకు పాల్పడుతున్నారని స్థానికుల ఫిర్యాదు మేరకు ఈ చర్యలు చేపట్టారు. బంక్ లోకి సిగరెట్లు విసరడం ప్రమాదకరమని చెబితే దాడి చేశారని వాపోతున్నారు. రాత్రి 10 గంటలు దాటాక ఈ దారి మీదుగా వెళ్లేందుకు భయపడుతున్నామని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆకతాయిల ఆగడాలపై ఇటీవల పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని స్థానికులు తెలిపారు. వీరి అరాచకాలు, దాడి చేసిన దృశ్యాలను సీపీకి అందించామన్నారు. అధికారులు స్పందించి దుకాణాలు తొలగించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అవుట్ పోస్టు పెడతాం..

కరాసా ప్రాంతంలో పోలీస్ అవుట్ పోస్ట్ పెట్టేందుకు ప్రతిపాదనలు ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో ఆకతాయిల బెడద ఎక్కువగా ఉండటంతో ఇక్కడ అవుట్ పోస్ట్ పెట్టాలని అధికారులు ప్రతిపాదించారు. దీంతో ఈ ప్రాంతంలో ప్రత్యేకంగా కంటైనర్ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారని తెలుస్తోంది. ఇది అందుబాటులోకి వస్తే ప్రత్యేకమైన బీట్ ఉండటం వల్ల ఆకతాయిల ఆగడాలు తగ్గుతాయని స్థానికులు భావిస్తున్నారు. అవుట్ పోస్ట్ త్వరితగతిన ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు

గోపాలపట్నం: గతంలో చంద్రబాబు ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని పెద్ద ఎత్తున చేపట్టినన నిరసన కార్యక్రమంలో అమరులైన సీపీఎం కార్యకర్తలు బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డిలకు జోహార్లు పలుకుతూ గోపాలపట్నం పెట్రోల్ బంక్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరుతో రాష్ట్ర ప్రజల మీద భారాలు వేయడం సరికాదన్నారు. ఆదానీ స్మార్ట్ మీటర్లను పెట్టరాదని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని, లేదంటే పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామని హెచ్చరించారు. గోపాలట్నం జోన్ కార్యదర్శి జగన్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బలివాడ వెంకటరావు, సీపీఎం జోన్ కమిటీ నాయకులు అనసూయ పాల్గొన్నారు.



గోపాలపట్నం పెట్రోల్ బంక్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యుత్ కార్మికులు, సీపీఎం నాయకులు

జనారణ్యంలోకి కొండగొర్రె


ఇందిరానగర్ టింబర్ డిపోలో సేదదీరుతున్న కొండగొర్రె

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు ఇందిరానగర్‌లోకి ఓ కొండగొర్రె వచ్చి సేదదీరింది. బుధవారం మధ్యాహ్న సమయంలో సింహాచలం కొండ పైనుంచి దిగువకు వచ్చింది. జనారణ్యంలోకి అది రావడంతో బెదిరిపోయి ఇందిరానగర్ టింబర్ డిపో పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ గోడ దూకింది. గాయాలు కావడంతో అక్కడే ఉండిపోయింది. కొందరు యువకులు టింబర్ డిపోలోకి తీసుకొచ్చి గొర్రెను ఉంచారు. డిపో యజమానికి చంద్రశేఖర్ సపర్యలు చేశారు. పశువుల వైద్యులను తీసుకొచ్చి వైద్యం చేయించారు. అనంతరం ఫారెస్ట్ అధికారులకు సమాచారమందించి వారికి అప్పగించారు. కొండగొర్రెను చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు.

